# వైఫల్యాలు అంగీకరించకుండా అభాండాలా?



- నిజాలు తెలుసుకొని పాలనపై దృష్టిపెట్టు
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు హితవు
- విద్యుత్తు ఉద్యోగులపై వ్యాఖ్యలపై ఫైర్

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఉద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను మాజీమంత్రి హరీశ్‌రావు ఖండించారు. కరెంట్ కోతల విషయంలో సీఎం తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతిపక్షాలు, విద్యుత్తు ఉద్యోగుల మీద అభాండాలు వేయటాన్ని తీవ్రంగా ఎండగట్టారు. విద్యుత్తు రంగ వైఫల్యాలపై సీఎం చేసిన వ్యాఖ్యలు ఆడరాక మద్దెల ఓడు అన్నట్టుగా ఉన్నదని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్తు ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించిందని, రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5 నెలల్లోనే ఆ వ్యవస్థను కుప్పకూల్చిందని ధ్వజమెత్తారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయేలా విద్యుత్తు సరఫరా చేయటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలు, విద్యుత్తు ఉద్యోగులపై రేవంత్ నిరాధార ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్తు ఉద్యోగులపై నెపం నెట్టడమే తప్ప కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి సీఎంకు లేకపోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విద్యుత్తు ఉద్యోగులను నిందించాలనే చిల్లర చేష్టలు మాని, కేసీఆర్ హయాంలో రెప్పపాటు కూడా పోనివిధంగా 24 గంటల విద్యుత్తుపై దృష్టిసారించాలని సీఎంకు సూచించారు. తనలాగే అందరూ కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతారని సీఎం భ్రమల్లో ఉండకుండా పాలనపై దృష్టిసారించాలని హితవు పలికారు.

## 'విద్యుత్ సంస్థల్లో పదోన్నతులు కల్పించాలి'

హైదరాబాద్, మే15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్ కో, జెన్ కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో ఏడాదిన్నర కాలం పాటు ప్రమోషన్లు నిలిపివేశారని, వెంటనే పదోన్నతులు కల్పించాలని బీసీ, ఓసీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కోడెపాక కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. జేఏసీ నేతలతో కలిసి ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీని బుధవారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రత్యక్ష నియామకాల ద్వారా ఫీడర్ పోస్టుల్లో ఎంపికైన ఉద్యోగుల సీనియార్టీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించి ప్రకటించకపోవడం మూలంగానే విద్యుత్‌సంస్థల్లో పదోన్నతులు నిలిచిపోయాయని వివరించారు. దీంతో వేలాది ఉద్యోగులు నష్టపోతున్నారని వాపోయారు. పదోన్నతుల విషయమై సీఎండీ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సీఎండీని కలిసిన వారిలో కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, వైస్‌చైర్మన్ సుధాకర్ రెడ్డి, కో కన్వీనర్ భానుప్రకాశ్, విజయకుమార్ తదితర నాయకులు ఉన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



చిన్న గంగారం (ఫైల్)

ఆలూర్, మే 15: పొలం వద్ద వైర్లు సరిచేస్తుండగా కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం కల్లెడి గ్రామంలో చోటుచేసుకున్నది. కల్లెడి గ్రామానికి చెందిన ఉమ్మెడ చిన్న గంగారాం అలియాస్ చిన్నారెడ్డి (50) బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లి స్టార్టర్‌కు కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిజామాబాద్ దవాఖానకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

# 'నెహ్రూ' జంతువుల శ్మశానవాటిక!


### జూపార్కులో మరణ మృదంగం

- కిడ్నీవ్యాధులతో 60కి పైగా మృతి
- అవయవాలు చెడి తాబేలు మరణం
- తాజాగా రెండు కిడ్నీలు పాడై తెల్లపులి కన్నుమూత
- మీరాలం చెరువు నీరే కారణమన్న వైద్యులు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కులో అరుదైన జంతుజాలాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిత్యం పిల్లల నుంచి పెద్దల దాకా లక్షలాది మంది సందర్శకులను అలరిస్తున్న జంతువుల వరుస మరణాలు అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నది. కిడ్నీ వ్యాధులతో పాటు వివిధ అవయవాలు చెడి జూపార్కులోని పలు జంతువులు మృత్యువాత పడ్డాయి. కిడ్నీవ్యాధులతోనే 60కి పైగా మరణించాయని జూపార్కు వెటర్నరీ వైద్యాధికారుల గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రతీనెలా ఏదో ఒక జంతువు కిడ్నీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతూ మరణిస్తున్నది. దీనంతటికీ జూపార్కులోకి వచ్చే మీరాలం చెరువు కలుషిత నీరే కారణమని వైద్యులు తేల్చారు. ఆ చెరువు నీరు తాగడం వల్లే తరచూ జూపార్కు జంతువుల కిడ్నీలు దెబ్బతింటున్నాయని పశువైద్యాధికారుల పరీక్షల్లో తేలింది. జంతువుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన మీరాలం చెరువు కలుషిత జలాలు జూపార్కులోకి రాకుండా నిరోధించడంలో రాష్ట్ర అటవీశాఖ విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జూపార్కులో కలుషిత జలాలను శుద్ధి చేసేందుకు సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని జూపార్కు క్యూరేటర్ సిఫారసు చేసినా సర్కారు సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాగే కలుషిత జలాలు వస్తుంటే భవిష్యత్తులో జూపార్కులో జంతువులన్నీ అంతర్ధానం అయ్యే పరిస్థితులు నెలకొంటాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కనువిందు చేస్తున్న అరుదైన జంతువులు

నెహ్రూ జంతు ప్రదర్శనశాలలో మొత్తం 2,240 జంతువులు ఉన్నాయి. వీటిలో 664 క్షీరదాలు, 97 రకాల 1,227 పక్షులు, 38 రకాలకు చెందిన 341 సరీసృపాలు, 8 ఉభయచరాలు ఉన్నాయి. బాతులు, కొంగలు, వివిధ రకాల రంగురంగుల పక్షులు, చిలుకలు, ఎత్తైన జిరాఫీలు, అడవిదున్నలు, చిరుతలు, పులులు, సింహాలు, తాబేళ్లు, కోతులు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి.




### పోస్టుమార్టం రిపోర్టులో తేలిన వాస్తవాలు

జూపార్కులో పలు జంతువులు మీరాలం చెరువు కలుషిత జలాలు తాగడం వల్లే వాటి కిడ్నీలు, ఇతర అవయవాలు చెడి మరణించాయని హైదరాబాద్ వెటర్నరీ కళాశాల పశుసంవర్ధక శాఖ ప్రొఫెసర్లు స్పష్టం చేశారు. మంగళవారం జూపార్కులో అరుదైన రాయల్ బెంగాల్ జాతికి చెందిన అభిమన్యు అనే మగ తెల్లపులి రెండు కిడ్నీలు చెడి మరణించిందని పశు వైద్యాధికారుల పరీక్షల్లో తేలింది. గత మార్చి 15న జూపార్కు ప్రవేశ మార్గంలోనే సందర్శకులకు కనువిందు చేసిన 125 ఏండ్ల వయసున్న అరుదైన గాలాపాగోస్ జెయింట్ తాబేలు మృత్యువాత పడింది. కిడ్నీతోపాటు ఇతర అవయవాల వైఫల్యం వల్లే ఆ తాబేలు మరణించిందని పశుసంవర్ధక శాఖ వైద్యులు, రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల బయోలాజికల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలూ తేల్చారు. మీరాల చెరువు నీటిలో నైట్రేట్లు, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, కెమికల్స్, వివిధ రకాల మెటల్స్ ఉన్నాయని ల్యాబ్ పరీక్ష నివేదికల్లో వెల్లడైందని జూపార్కు వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏ హకీం తెలిపారు. జూపార్కులో జంతువుల కోసం ఆర్వో వాటర్‌ప్లాంట్ నీటిని సరఫరా చేస్తున్నామని జూపార్కు ప్రజా పౌరసంబంధాల శాఖ అధికారి షేక్ హనీఫ్ తెలిపారు.

### కాలుష్యం కాటు నుంచి కాపాడండి

జంతువులను కాలుష్యపు కాటు నుంచి కాపాడాల్సిన అవసరం ఉన్నది. పరిశ్రమల వ్యర్థ జలాల వల్ల మీరాలం చెరువు అత్యంత కాలుష్య కాసారంగా మారింది. జూపార్కు జంతువులు మరణించకుండా తెలంగాణ అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా మేలుకోవాలి. కాలుష్యాన్ని నివారించేందుకు మున్సిపల్ శాఖ సత్వర చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ లూబ్నా సర్వత్, పర్యావరణ ప్రేమికురాలు, హైదరాబాద్

# నీకు ఇక్కడేం పని? గెటవుట్!


- మెప్మా ఉద్యోగిని పట్ల ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి దురుసు ప్రవర్తన
- మనస్తాపంతో ఉద్యోగానికి గంగామణి రాజీనామా

ఆర్మూర్‌టౌన్, మే 15: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఓ మహిళా ఉద్యోగిపట్ల దురుసుగా ప్రవర్తించారు. అందరి ముందే 'గెటవుట్' అంటూ అవమానించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. పట్టణ పేదరిక నిర్మూలణ సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)గా దోండి గంగామణి ఆర్మూర్‌లో 14 ఏండ్లుగా పనిచేస్తున్నారు. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆర్పీలకు సైతం డ్యూటీ వేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి.. డ్యూటీలో ఉన్న గంగామణితో దురుసుగా మాట్లాడారు. 'ఇక్కడ ఎందుకు ఉన్నావు? బయటకు వెళ్లు.. గెటవుట్' అని అందరి ముందే ఆమెను అవమానించారు. మున్సిపల్ కమిషనర్ తమకు ఇక్కడ డ్యూటీ వేశారని ఆమె ఎంత చెప్పినా ఎమ్మెల్యే వినిపించులేదు. 'ఆర్పీలకు ఇక్కడ ఏం పని? ఎందుకు వచ్చావు? వెళ్లిపో' అంటూ ఆమెను పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపించారు. దీంతో రోదిస్తూ గంగామణి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అందరి ముందు అవమానం జరగడంతో మనస్తాపానికి గురైన గంగామణి.. మున్సిపల్ కమిషనర్ రాజుకు బుధవారం రాజీనామా లేఖను అందజేశారు. తన రాజీనామాకు కారణం ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డేనని ఆమె స్పష్టం చేశారు. న్యాయం కోసం, ధర్మం కోసం పని చేస్తానని చెప్పుకునే ఎమ్మెల్యేకు ఆడవారితో ఎలా మాట్లాడాలో తెలియదా? అని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండి అందరినీ సమానంగా చూడాలని, ఎవరినీ కించపరిచేలా ప్రవర్తించుకూడదని హితవు పలికారు.



ఎమ్మెల్యే వ్యాఖ్యలతో మనస్తాపానికి గురై మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా లేఖను అందజేస్తున్న మెప్మా ఆర్పీ గంగామణి

## లోకం పోకడ




ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే దాడుల చేసే వాళ్ల తో ఫ్రెండ్లీగా వుండడమా?

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.7°c | 21.5°c |
| నిజామాబాద్ | 41.2°c | 22.0°c |
| నల్లగొండ | 40.5°c | 28.8°c |
| రంగారెడ్డి | 40.1°c | 22.2°c |
| మహబూబ్‌నగర్ | 40.0°c | 28.9°c |
| మెదక్ | 39.3°c | 20.4°c |
| వరంగల్ | 38.0°c | 27.0°c |
| కరీంనగర్ | 38.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 36.8°c | 24.4°c |
| ఖమ్మం | 36.0°c | 26.0°c |



## మరో 4 రోజులు వర్షాలు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం నుంచి ఈ నెల 19 వరకు అక్కడక్కడా తేలిక పాటు లేదా మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వరంగల్, గద్వాల, హనుమకొండ, నారాయణపేట జిల్లాల్లో గురువారం వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉదయం ఎండకాసినా, సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షం కురుస్తుందని అధికారులు పేర్కొన్నారు. 38 డిగ్రీల నుంచి 43 డిగ్రీల మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడుతాయని, నగర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్ రోడ్డులోని పుట్‌పాత్‌పై గుర్తు తెలియని వృద్ధుడు (65) వడదెబ్బతో మంగళవారం మృతిచెందినట్టు కాచిగూడ అడ్మిన్ ఎస్సై సుభాశ్ తెలిపారు.

## గత వేసవిలో 2 వేల ఏండ్ల రికార్డు ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ: గత వేసవి చాలా హాట్ గురూ అని పరిశోధకులు తేల్చారు. 2 వేల ఏండ్లలో ఎన్నడూ లేనంతగా 2023 వేసవిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. పారిశ్రామికీకరణకు పూర్వం నాటి ఉష్ణోగ్రతల కన్నా ప్రస్తుత ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలని 2015లో కుదిరిన పారిస్ ఒప్పందం పేర్కొంది. కానీ ప్రస్తుత ఉష్ణోగ్రతలు ఈ పరిమితిని మించిపోయినట్లు పరిశోధకులు తెలిపారు. 1850–1900 మధ్య వేసవి కాలాల్లోని ఉష్ణోగ్రతల సగటు కన్నా 2023లోని ఎండా కాలంలో 2.07 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదైనట్లు తెలిపారు.



బీఆర్ఎస్ కార్యకర్త నిర్బంధాన్ని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పోలీసు స్టేషన్ ఎదుట రహదారిపై మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

## బీఆర్ఎస్ ఆందోళన.. మెట్టు దిగిన పోలీసులు

పార్టీ కార్యకర్త నవీన్ నిర్బంధానికి విముక్తి • కాంగ్రెస్ నాయకుడిపై అట్రాసిటి కేసు నమోదు

అశ్వారావుపేట, మే 15: బీఆర్ఎస్ కార్యకర్త నిర్బంధాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు చేసిన ఆందోళనతో పోలీసులు మెట్టు దిగారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కార్యకర్తకు నిర్బంధం నుంచి విముక్తి కల్పించారు. నిర్బంధానికి కారకుడైన వ్యక్తిపై బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తగిగా నవీన్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సోమవారం తమ గ్రామ పోలింగ్ బూత్ వద్ద క్యూలో నిల్చున్నాడు. ఈ క్రమంలో అక్కడి కాంగ్రెస్ నాయకుడు ఆరేపల్లి సూరిబాబు సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లబోయాడు. ఈ విషయాన్ని నవీన్ గమనించి అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు సమాచారమిచ్చాడు. దీంతో సూరిబాబు నుంచి కానిస్టేబుల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు ఆగ్రహించిన సూరిబాబు.. 'నా పైనే కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేస్తావా? బయటకు రా నీ అంతు చూస్తా' అంటూ కులం పేరుతో దూషిస్తూ బెదిరించాడు. అతడి ఒత్తిడితో పోలీసులు మంగళవారం నవీన్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించారు. అంతేకాదు.. సూరిబాబుపై నవీన్ ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వెంటనే స్టేషన్‌కు చేరుకుని నవీన్‌ను ఎందుకు నిర్బంధించాంటూ పోలీసులను ప్రశ్నించారు. అయినా పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వెంకటేశ్వర్లు.. గ్రామం నుంచి వచ్చిన ఆదివాసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి స్టేషన్ ఎదుట బైఠాయించారు. స్పందించిన పోలీసులు.. తాటితో చర్చలు జరిపారు. ఈ మేరకు నవీన్ ఫిర్యాదుపై ఎస్సై శివరామకృష్ణ బుధవారం అనంతారంలో విచారణ జరిపి కాంగ్రెస్ నాయకుడు సూరిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులపై కేసు నమోదు

జనగామ చౌరస్తా, మే 15: జనగామ పట్టణ కేంద్రంలోని ధర్మకంచ జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి న్యూసెన్స్‌కు కారణమైన కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, దాసరి క్రాంతి, మేడ శ్రీనివాస్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీరస్వామి, మజీద్, తిప్పారపు విజయ్, మల్లిగారి రాజు, గజ్జెల నర్సిరెడ్డి, ఉల్లెంగుల సందీప్‌పై కేసు నమోదు చేసినట్టు అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు. ఈ బూత్‌లో విధుల్లో ఉన్న ఏఆర్ ఎస్సై కే శ్వేత ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తన వర్గం నాయకులతో కలిసి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించడంపై అక్కడే ఉన్న బీఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్ ప్రవీణ్ అభ్యంతరం తెలుపుతూ ప్రిసైడింగ్ అధికారికి చెప్పారు. పోలింగ్ కేంద్రం బయట ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లాతో కలిసి ప్రశాంత్‌రెడ్డిని బయటకు పంపించాలని లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడే విధుల్లో ఉన్న ఏసీపీ అంకిత్‌కుమార్, సీఐ రఘుపతిరెడ్డి ఇరు వర్గాలను శాంతింపజేస్తూ పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించారు. ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను చెడగొట్టేలా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకులు, వారితో గొడవకు దిగిన బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో గువ్వల బాలరాజు

## అచ్చంపేటలో పోలీసుల ప్రేక్షకపాత్ర

- కాంగ్రెస్ దాడులను ఎందుకు అడ్డుకోలేదు?
- న్యాయం కోసం ఎంత దూరమైనా వెళ్తాం
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్

అచ్చంపేట టౌన్, మే 15 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ నాయకులపై దాడులకు తెగబడటం అత్యంత దారుణమని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్రపోషించడంపై మండిపడ్డారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి అచ్చంపేటలో మీడియాతో మాట్లాడారు. దాడి జరుగుతున్నా పోలీసులు చూస్తూ ఉండిపోవడం బాధాకరమని, ఇదంతా చూస్తుంటే 25 ఏండ్లు పోలీస్ శాఖలో పని చేసి రాష్ట్రపతి చేతుల మీదుగా అత్యున్నత శౌర్య పథకం అందుకున్న తనకు చాలా సిగ్గుగా ఉన్నదని అన్నారు. సెంట్రింగ్ కర్రలతో దాడి చేస్తున్నా.. పోలీసులు దుండగులను అడ్డుకోలేకపోవడంపై మండిపడ్డారు. దాడి చేసిన వారు కండ్ల ఎదుటే ఉన్నా.. పట్టుకోకుండా ఇప్పుడు పరారీలో ఉన్నారని చెప్పడం అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని, న్యాయం కోసం ఎంత వరకైనా వెళ్తామని తేల్చిచెప్పారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ గౌడ్ ప్రాణాలకు ప్రమాదమున్నదని.. వారికి ఏమైనా జరిగితే రేవంత్ రెడ్డి బాధ్యతవహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

### ప్రతిదాడులు మా సంస్కృతి కాదు

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వలబాలరాజు మాట్లాడుతూ దాడులకు ప్రతిదాడులు చేసే సంస్కృతి తమది కాదని అన్నారు. దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తూ అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. పోలింగ్ మరుసటి రోజు కాంగ్రెస్ నేతలు గూండాల్లా వ్యవహరించి బీఆర్ఎస్ కౌన్సిలర్ సుంకరి నిర్మలబాలరాజు ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ అక్రమ సంపాదనకు మరిగి దాడులకు ప్రేరేపిస్తున్నాడని ఆరోపించారు.

# రుణమాఫీకి కార్పొరేషన్

- విధానాలు, ప్రణాళికలు రూపొందించండి
- వానకాలంలోగా ధాన్యం కొనుగోళ్లు
- విభజన అంశాలపై పూర్తి నివేదికివ్వండి
- జూన్ 2 తరువాత ఏపీకి కేటాయించిన భవనాలను స్వాధీనం చేసుకోండి
- సమీక్షా సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఈ నెల 18న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేసి తీరాల్సిందేనని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 18న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మంత్రివర్గ సమావేశంలో ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలు, రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే వానకాలం సీజన్‌కు పంటల ప్రణాళిక తదిరత అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగిలేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లతోపాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు రుణమాఫీకి అవసరమైన నిధులను సమీకరించేందుకు ఉన్న వివిధ మార్గాలపై చర్చించారు. రూ.2 లక్షల రుణమాఫీకి విధి విధానాలు, ప్రణాళికలు రూపొందించాలని, మహారాష్ట్ర, రాజస్థాన్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి రుణమాఫీకి అవసరమైన నిధులను సర్దుబాటు చేయాలని, భారీ మొత్తంలో నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. వానకాలం ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. తడిసిన ధాన్యం, తేమ విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడే రైస్‌మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు.

### విభజన అంశాలపై నివేదిక ఇవ్వండి

జూన్ 2వ తేదీకి రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల కేటాయింపు, ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించారు. షెడ్యూలు 9, షెడ్యూలు 10లో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించిన పంపిణీ ఇంకా పూర్తి కాలేదని, విద్యుత్తు సంస్థల బకాయిలు ఇంకా తేలలేదని, పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని అధికారులు వివరించారు. ఆయా అంశాలపై ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీలు వంటి అంశాలు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. పదేండ్ల కాలానికి ఏపీకి కేటాయించిన లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## 'హైదరాబాద్'లో రీపోలింగ్ జరపాలి

- బీజేపీ అభ్యర్థి మాధవీలత డిమాండ్



హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రీపోలింగ్ జరపాలని ఇక్కడి నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి మాధవీలత డిమాండ్ చేశారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని పలు చోట్ల ఎంఐఎం నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. చాంద్రాయణగుట్టలోని రియాసత్ నగర్‌లో కార్పొరేటర్ ఇంట్లో పోలింగ్ బూత్ (నం. 40) పెట్టారని చెప్పారు. ఆ భవనంలో పైన కార్పొరేటర్ ఇల్లు ఉన్నదని అన్నారు. సాయంత్రం తలుపులు మూసేసి ఓట్లు రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. దాదాపు 45 నిమిషాల రిగ్గింగ్ తర్వాత లోపల ఉన్న నేతలు బయటికి వెళ్లిపోతుంటే తాను వీడియో తీశానని చెప్పారు. మరోచోట 16 ఏండ్ల అమ్మాయితో రెండు ఓట్లు వేయించారని ఆరోపించారు. బహదూర్‌పూర నియోజకవర్గంలో ఒకే వ్యక్తి ఓటు వేస్తున్నట్టుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన వీడియో పశ్చిమ బెంగాల్‌కు చెందినదని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది.



జగిత్యాల జిల్లా మల్లాపూర్ తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న ఓబులాపూర్ గ్రామస్థులు

## ఓబులాపూర్ భూ సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్ తహసీల్దార్ ఆఫీసు ఎదుట గ్రామస్థుల ధర్నా

మల్లాపూర్, మే 15: అటవీశాఖ భూమిని కొందరు ఆదరాబాదరగా సర్వే చేయించి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, ఈ భూమిని కాపాడాలని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 49లోని 1.10 ఎకరాల భూమిలో 20 ఏండ్లుగా వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారని తెలిపారు. ఈ భూమిపై కన్నేసిన కొందరు కబ్జాదారులు చుట్టు పక్కల భూములు గల రైతులకు చెప్పకుండా సర్వేచేయించారని చెప్పారు. అధికారులు సక్రమంగా సర్వే చేసి ఈ భూమిని రక్షించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసినట్టు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వీర్‌సింగ్ గ్రామస్థులతో మాట్లాడి 15 రోజుల్లో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.